# పుత్రాన్వేషణ

'జనరల్ న్యూస్ రూమ్‌లో జయచంద్రను కలవాలి'

ఉలెన్ స్వెట్టర్‌తో, ఓవర్‌కోట్‌తో, ఉలెన్‌కేప్‌తో, షూజ్‌తో గేట్ దగ్గర నుంచున్న వాచ్‌మన్ ఆ వచ్చిన పెద్దమనిషిని చూసి ముందు నమస్కారం చేశాడు. ఘోరమైన ఆ ఢిల్లీ చలిలో ఆ పెద్దమనిషి పాదాలకు చెప్పులు లేకుండా మామూలు నూలుగుడ్డలతో రావటం మానవమాత్రులకు సాధ్యం కాదని పించింది. నెరిసిన గడ్డంతో వీపు మీదికి పడుతున్న జుత్తుతో ఆ వచ్చిన పెద్ద మనిషి వాచ్‌మన్‌కు ఎవరో మహాత్ముడు, మహాపురుషుడులా కనిపించాడు.

వేకువ జాము. పార్లమెంట్ స్ట్రీట్‌లో ఉన్న ఆకాశవాణి కేంద్రమైన బ్రాడ్‌కాస్టింగ్ హౌజ్‌లో ఉదయం షిఫ్ట్ సందడి మొదలయింది. న్యూస్ సర్వీస్ డివిజన్ సిబ్బందినీ, ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం సిబ్బందినీ తెచ్చే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

తనతో రమ్మని చెప్పి లోపలికి నడిచాడు వాచ్‌మన్.

ఆ వాచ్‌మన్‌కి అక్కడి సిబ్బంది ముఖాలే గుర్తు తప్ప పేర్లు తెలీవు. జయచంద్ర ఎవరో తెలీదు. జనరల్ న్యూస్ రూంలో కనిపించిన ఒక పెద్దవయసామెతో జయచంద్ర కోసం వచ్చిన ఆ సాధువును పరిచయం చేసి వెళ్లిపోయాడు వాచ్‌మన్.

ఆ వచ్చిన వృద్ధుని ముఖంలో చెప్పలేని ఆ వింతఅందం, నిరాడంబరత్వం, ప్రపంచాన్ని మరచిపోయినవైరాగ్యం చూస్తూ ఆమె కొంతసేపు నోటమాట రాక నుంచుండిపోయింది. భక్తిముంచుకొచ్చి అప్రయత్నంగా చేతులు జోడించింది. ఆమె చూపులు అతడి పాదాలను తాకాయి.

"జయచంద్ర" అన్నాడు ఆ వృద్ధుడు. ఆ వృద్ధుని పేరు కృష్ణమూర్తి.

ఆ మాట విన్న తర్వాత ఆమెకి చలనం వచ్చింది. తెల్లగుడ్డలతో నెరిసిన జుత్తుతో వచ్చిన ఆ పెద్దమనిషిని చూసినప్పుడు తనలో వింత ఆనందం, ఆవేశం, భక్తిభావం చెలరేగి మనసు స్వాధీనం తప్పటం అమెకు విచిత్రం అన్పించసాగింది. లోపల

కూర్చుని పనిచేసుకుంటున్న జయచంద్రను పిలుచుకుని వచ్చింది.

వాచ్‌మన్ ప్రేమాభిమానాలు, నెమ్మది కృష్ణమూర్తికి ఎంతోనచ్చాయి. జయచంద్ర కోసం అక్కడకు ఎవరు వచ్చినా అతడిని కలుసుకోవటానికి ఏ ఇబ్బందీ ఉండదు. డ్యూటీలు తెలియకుండా వచ్చినా సరే ఉదయంపూట జయచంద్ర అక్కడ తప్పనిసరిగా దొరుకుతాడు.

ఎడంచేతిలో రెండు టైప్‌కాగితాలతో, కుడిచేతిలో బాల్‌పెన్‌తో, తలుపు తెరిచి బయటకు వచ్చిన జయచంద్ర, కారిడార్‌లో పరధ్యానంగా నుంచున్న కృష్ణమూర్తిగారిని చూసి లోపలకు తీసుకుపోయాడు. లోపల వెచ్చగా ఉంది. నాలుగయిదు టైప్‌రైటర్‌ల మీద పనిసాగుతోంది. ఎడిటర్ ఇన్ చార్జ్ టేబిల్ దగ్గర స్టెనో దూరప్రాంతంలో సమాచారాన్ని టెలిఫోన్‌లో అందుకుంటున్నాడు. ఓ గోడప్రక్క టెలిప్రింటర్ అవిరామంగా మోగుతున్నది. ఇద్దరుముగ్గురు అసిస్టెంట్ ఎడిటర్స్ న్యూస్‌రూమ్‌లో హడావిడిగా తిరుగుతున్నారు.

"కొంచెంసేపు ఇట్లా కూచోండి మీరు" అతను ఓ కుర్చీని తన టేబుల్ దగ్గరవేసి "బులిటిన్ పని, ఆలస్యం జరిగితే న్యూస్ రీడర్ వచ్చిపడేట్టున్నాడు" అని తన చేతిలోని కాగితాల వేపు దృష్టిమళ్లించి టైపిస్ట్‌కు స్టోరీ డిక్టేట్ చేయటం తిరిగి ప్రారంభించాడు.

ఉలెన్‌సూట్‌లు పనిలో మునిగి తేలుతున్నాయి. ఓవర్‌కోట్‌లతో ఇద్దరు యువతులు చురుగ్గా టైప్ చేసుకుంటున్నారు.

ఓ టేబుల్ దగ్గర ఓ యువకుడు కునికిపాట్లు పడుతున్నాడు. జయచంద్రను పిలుచుకువచ్చిన ఆ స్త్రీ దూరంగా ఓ టేబుల్ ముందు న్యూస్ పేపర్ చదువుతూ కూర్చుని ఉంది. కృష్ణమూర్తిగారి చూపు చుట్టూ తిరిగి జయచంద్ర మీద ఆగింది. గ్రే కలర్ ఉలెన్ సూట్‌లో, మెరుస్తున్న బ్లాక్ షూజ్‌తో కొంతసేపు ధర్మానే చూసినట్టయింది. కండ్లలో తళుక్కుమనే మంచితనం, ఎదిగిన ప్రతిభా సంస్కారాలు, వారసత్వంగా తెచ్చుకున్న సహృదయం — అట్లా ఎన్నెన్ని అందాలతోనో కన్పిస్తాడు జయచంద్ర.

దేశ సంచారం చేస్తున్న తన పుత్రుడు ధర్మా ఇంటినించి పారిపోయి ఎనిమిదేళ్లు నిండాయి. దగ్గర్లోనే దొరుకుతాడు. ఇంకెంతో కాలం పట్టదు, కలుస్తాడు. అదే ఆశతో కృష్ణమూర్తిగారు ఇప్పుడు జయచంద్ర దగ్గరకు వచ్చారు.

జయచంద్ర ఓ కాగితాన్ని టైపిస్ట్‌కు యిచ్చి "స్టోరీలో ఫస్ట్‌పేరా తీసుకోండి" అని ఎడిటర్ ఇన్ చార్జ్ దగ్గరకు వెళ్లాడు. అకాలీ సమస్యకు సంబంధించిన వార్త.

ప్రభుత్వం ప్రకటించిన ఉదారవైఖరి దృష్ట్యా సమస్యపరిష్కారానికి దోహదపడి రాష్ట్రంలో సుహృద్భావ వాతావరణం నెలకొల్పవలసిందని ప్రతిపక్షనాయకుల విజ్ఞప్తి. రాత్రి తొమ్మిదిగంటల ఇంగ్లీష్ బులిటిన్‌లో వెళ్లిన ఐటమే అది. ఉదయం బులిటిన్‌కు కూడా ఆ వార్త పనికొస్తుందనుకున్నాడు జయచంద్ర. ఆ సంగతే మాట్లాడాలని అతడు ఎడిటర్ ఇన్ చార్జి దగ్గరకు వెళ్లాడు.

ఆయనతో మాట్లాడి, తిరిగి తన టేబుల్ దగ్గరకు వచ్చి, టైపిస్ట్‌కు ఇచ్చిన కాగితం తీసేసుకుని రివైజ్డ్ స్టోరీ వచ్చిందని వేరే పేజీ ఇచ్చాడు జయచంద్ర. బులిటిన్‌కు సరిపడేంత మేటర్ దొరక్కపోయేసరికి రాత్రి బులిటిన్ తీసిచూట్టం తప్పని సరయింది.

కృష్ణమూర్తిగారు మౌనంగా కూర్చున్నారు. రంగస్థలంముందు కూర్చున్నట్టుంది. పాతకాలం గుర్తుకు వస్తున్నట్టుంది.ఎందుకీ ఉద్యోగాలు చేయాలి — ఎక్కడినించో పొట్ట చేత్తోపట్టుకుని ఇంతదూరం వచ్చి, ఇక్కడ ఈ వేషమూ భాషా ఈ ఉద్యోగవిధులూ, పోటీ, తాపత్రయం, ఈ పరుగూ అంతా కొత్తగా వింతగా అగమ్యంగా ఉంది.

జయచంద్రను చూసినప్పుడల్లా ధర్మాను కలిసినట్టే ఉంటుంది. వెంటనే తననించి వాడిని ఎవరో ఎత్తుకు పోతున్నట్టు అన్పిస్తుంది. ఆ భావం ముంచుకొచ్చిందా ఇంక అక్కడ ఒక్కనిమిషం కూడా ఆగలేడు. అతడి జీవితంలో ఎందరో ప్రేమమూర్తులు అదృశ్యమైపోయారు. ఆరేళ్ల వయసులో తల్లి అదృశ్యమైపోయింది. నలుగురామెను మంచుపల్లకిపై మోసుకు పోయినదృశ్యం గోడకి వేలాడేసిన పెయింటింగ్‌లా అతడి మనసుమీద ముద్రపడిపోయింది. డాక్టర్ ఇంజక్షన్, పడగవిప్పి కాటువేసి, తోకనేలకు కొట్టి పారిపోయిన పాము, బావిలో ఉబ్బిపోయిన మృతకళేబరం, శ్మశానంలో మంటలు... గడ్డకట్టుకు పోయిన ఈ దృశ్యాలు కన్నీళ్లతో అలుక్కుపోయిన కాన్వాస్‌ల దొంతర్లు.

దాంతో ఆయన ఈ ఉత్తుంగ హిమాలయాలవేపు తనను విసిరేసుకున్నాడు. ఈ సారి ఆయన దాదాపు రెండేళ్లు రిషీకేశ్‌లోనే ఉండిపోయాడు. మధ్యమధ్య బెనారస్, అమర్నాధ్ వెళ్లటం రావటం మామూలే. రిషీకేశ్ బావుంటుంది. ఎప్పుడన్నా ధర్మా రిషీకేశ్‌లోనే తనను కలుసుకుంటాడని స్వామీ భగవాన్‌జీ చెప్పారు.

ఆయన నిన్ననే ఢిల్లీ వచ్చాడు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ క్వార్టర్స్‌లో ఉంటున్న తన చిన్ననాటి స్నేహితునితో అర్ధరాత్రి దాటేవరకు, తప్పిపోయి

హిమాలయాల్లో తిరుగుతున్న తన కొడుకు గురించి ముచ్చట్లు చెప్పి, స్నేహితుడు నిద్రపోయిన తర్వాత ఓ గంటసేపు మేనువాల్చి, లేచి, ఆ ఘోరమైన చలిలో చన్నీటి స్నానంచేసి కాలినడకను బయల్దేరాడు. దాదాపు పదికిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకాశవాణికి. అక్కడ జయచంద్రను చూడాలి, అక్కడే తెలుస్తుంది ధర్మాసంగతి.

నాటకం చూస్తున్నట్టుగా, తెరమీద బొమ్మలను చూస్తున్నట్టుగా ఉంది ఆయనకి అక్కడ. జయచంద్ర ఇప్పుడక్కడ ముఖ్యపాత్రధారి. మిగిలిన వాళ్లంతా నిజంగానే బొమ్మలు. ప్రాణం ఉన్న బొమ్మలు. ఏడ్చే నవ్వే బొమ్మలు.

"ఇంకో పదినిమిషాల్లో బులిటిన్ పని ముగుస్తుంది నాన్నగారూ. మనం మాట్లాడుకోవచ్చు. అసలు డ్యూటీ రేణుది. ఆమె రాలేదు. స్టాండ్‌బై డ్యూటీనాది. మిస్ రేణూ ముఖర్జీ మీకు గుర్తేకదా! క్రిందటిసారి వాళ్ల ఇంటికి తీసుకుపోయిందే ఆ రేణు, రిషీకేశ్ వచ్చి ఫోటోలు తీసిన—"

జయచంద్ర మళ్లీ తన డ్యూటీలో పడ్డాడు. రాత్రి పూల్ వెతికితే పనికివచ్చే నాలుగయిదు స్టోరీలు దొరికాయి. వాటిల్లో తేదీలులాంటి చిన్నచిన్న మార్పులు చేసి, ఒకటిరెండు వాక్యాలను కుదించి సరిచేసి ఆ పేజీలను టైపిస్ట్ దాస్‌కు ఇచ్చేశాడు. అంతలోనే ఎడిటర్ ఇన్ చార్జ్ రెండు పేజీలు పంపించాడు. దాంతో బులిటన్‌కు వార్తల కరువు తీరింది. పూల్ కాపీలనే యూనిట్స్‌కి పంపించేసి ఊపిరి పీల్చుకున్నాడు జయచంద్ర.

కృష్ణమూర్తిగారిని కళ్లారా జయచంద్ర చూసింది కూడా అప్పుడే. క్షణంలోనే జయచంద్ర కళ్లలోంచి జరజరా నీళ్లు రాలిపడ్డాయి. దుఃఖాన్ని దిగమింగు కునేందుకు ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడు. దు:ఖంతో తను కూలిపోతున్నాడు. భౌతికదేహాన్ని మృత్యువు మింగేస్తున్నట్టుంది. మనసు చివికిపోయింది.

టైపిస్ట్ దాస్ పిలుపు ఆ సమయంలో ఊపిరి పోసినంత మేలుచేసింది. హెడ్‌లైన్స్ పేజీ పని మొదలయింది.

శరీరం మీద కేవలం తెల్లటి నూలులాల్చీ, ధోతీతో ఉన్న ఈ సాధువు జనరల్ న్యూస్ రూమ్‌లో అందరి దృష్టినీ ఆకర్షించటం జయచంద్ర కళ్లల్లో పడింది. మనుషుల ప్రాణాలను బలిగొంటున్న విపరీతమైన ఆ చలిలో ఈ పెద్దమనిషి వేసవి గుడ్డల్లో కనిపించటం విడ్డూరం అనిపించి చూసినవాళ్లు ఆ ముఖంలోని తేజస్సుకు సమ్మోహితులవుతున్నారు. ఇద్దరు ముగ్గురు ఆయన దగ్గరకు వచ్చి నమస్కారం చేసి వెళ్లారు.

బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో చలిమూలంగా ఇరవైమంది చనిపోయారు. ఫోర్త్‌హెడ్‌లైన్‌గా ఈ వాక్యం చెబుతున్నప్పుడు డ్యూటీలో ఉన్న డెప్యూటీ డైరెక్టర్ అటువేపు వచ్చి స్టీల్ ప్లాంట్ రికార్డుస్థాయి ఉత్పత్తికి సంబంధించిన వార్త ఫోర్త్ హెడ్‌లైన్ చేస్తే బావుంటుందని సలహా ఇచ్చాడు. మానవతా ఇతివృత్తానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యంపోయి, ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యం ఇవ్వటం ఆ సలహా వెనక ఉద్దేశం. చలికి ఇరవైమంది చనిపోయిన సత్యం మరుగున పడేసే ఆ సూచన జయచంద్రకు నచ్చలేదు. స్టీల్ ప్లాంట్ రికార్డ్ స్థాయి ఉత్పత్తిని అయిదో హెడ్‌లైన్ చేయవచ్చని జయచంద్ర చెప్పిన తర్వాత డి డి ఎన్ వెళ్లిపోయాడు.

మిస్ రేణూ ముఖర్జీ వచ్చింది. ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్‌లో రిక్విజిషన్ ఇవ్వటం మరచిపోయినందువల్ల తనకు వెహికిల్ రాలేదట. ఆ సంగతి ఆమెకు గుర్తొచ్చి టాక్సీకి ఫోన్‌చేసి వచ్చేసరికి ఈ ఆలస్యం.

ఇది మామూలే. ఎవరు ఉన్నా లేకున్నా పని సాగిపోయే యంత్రాంగం. ఎవరు పనిచేసినా చేయకున్నా పట్టించుకోని పని తీరు. హక్కులనూ, విధులనూ కలగాపులగం చేయగల అంచెలంచెల అధికారాల ప్రభుత్వ యాజమాన్యం. ఎవరు దేనికీ బాధ్యత తీసుకోలేని ఆయోమయ వ్యవస్థ. దానితో జయచంద్రకు కొత్తగా ఏ ఇబ్బందీ అన్పించలేదు. చేతిలో పని లేకుండా సోమరిపోతుగా ఉండాలంటేనే అతడికి తలనొప్పి. పైగా రేణూ ముఖర్జీ అంటే ఇష్టం, చనువు. ఆ భరోసాతోనే ఆమె ఆలస్యంగా వచ్చినందుకు ఏ సంజాయిషీ చెప్పుకోలేదు. ఇట్లాంటి అవాంతరం ఏదో వస్తే తప్ప ఆమె పంక్చ్యుయాలిటీ భంగంకాదు. పోతే ఇప్పుడు ఆమె రావటం జయచంద్రకు ఎంతో సంతోషంగా ఉంది. బులిటిన్‌పని దాదాపు పూర్తి కావచ్చింది. ఇంక ఆ పనిని ఆమెకు అప్పజెప్పేసి నాన్నగారుతో తాను కూర్చోవచ్చు. మాట్లాడు కోవచ్చు. అట్లా కేంటిన్ వేపు పోవాలనుకున్నాడు జయచంద్ర.

మిస్ రేణూ ముఖర్జీ, అక్కడ కూర్చున్న కృష్ణమూర్తిగారిని చూసి ఎగిరి గంతేసినంత ఉప్పొంగిపోయింది. 'నాన్నగారూ' అని ఒంగి ఆయన పాదాలను ప్రేమతో తాకి కళ్లకు అద్దుకుంది. జయచంద్ర ఆమెకు నేర్పిన తెలుగు మాటల్లో 'నాన్నగారు' ఒకటి. 'బాగున్నారా' అనికూడా తెలుగులోనే అడిగింది.

జయచంద్ర కోసం గత ఏడాది ఓ వేకువజామున వర్షంలో తడిసి వచ్చినప్పుడు తొలిసారిగా కృష్ణమూర్తిగారితో ఆమెకు పరిచయం.

ధర్మారావు, జయచంద్ర పదేళ్లక్రితం యూనివర్సిటీ మిత్రులట. దాదాపు

ఎనిమిదేళ్ల కిందట ధర్మారావు వరసగా నాలుగురోజులు కన్పించలేదట. ధర్మారావు ఎక్కడికో పనిమీద వెళ్లి ఉండచ్చుననుకున్నారట. అయినా వెతికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ధర్మారావుకు స్నేహితులతో ముడి. స్నేహితులంటే ప్రాణం. దాంతో ధర్మారావును వెతికిపట్టుకునే బాధ్యతతో తండ్రి కృష్ణమూర్తి వివిధ పట్టణాలు తిరగవలసి వచ్చింది. బంధువులకు, ఇంకా తెలిసినవాళ్లకి పాతకాలం స్నేహితులకు ఉత్తరాలు రాశాడు. తెలిసిన వాళ్లందరి ఇళ్లకిపోయి భోగట్టా చేశాడు. పత్రికల్లో స్నేహితులు ప్రకటన వేశారు. జాతకచక్రం తిరగవేస్తే సరిగ్గా ఈ వయసులో పెద్దప్రమాదం ఉందని ఒక సిద్ధాంతిగారు చెప్పారు. మరి కొందరు జ్యోతిష్కులు ఉత్తరదిక్కున కొండప్రాంతాలలో సాధువుగా తిరుగుతున్నాడన్నారు. ఓ కొండదొర "ప్రపంచంలో కలిసిపోయినాడని చెప్పితిని కదా" అన్నాడు. దాని అర్థం ఏమిటో వివరించి చెప్పమంటే, "దాని అర్థం తర్వాత తెలుస్తుందిలే" అని చెప్పాడు. ఆరోజుల్లోనే కృష్ణమూర్తికి ఒక మహాపండితుడు పరిచయమయ్యాడు. ఆయన చెప్పిందేమంటే బతికి ఉన్నాడని, అయితే ఈ బాహ్యప్రపంచ దృష్టిలో లేడని, ఈశ్వర అన్వేషణలో తాదాత్మ్యం చెందాడని. మొదటినించి ధర్మాకి దైవభక్తి ఎక్కువ. వాడు ఈశ్వరాన్వేషణలోనే హిమాలయపర్వత ప్రాంతాలలో తిరుగుతూ ఉంటాడని తండ్రిగా అతడిగట్టి నమ్మకం. ఓ సారి తన మాటల్లో ఇట్లాంటి అభిప్రాయాన్ని ధర్మా వ్యక్తం చేశాడని కృష్ణమూర్తిగారు చెబుతారు. హిమాలయాలలో తిరుగుతున్నట్టు అతడికి చాలాసార్లు స్వప్నాలలో కొడుకు కనిపించాట్ట. ఎక్కడున్నావ్ చెప్పు అని స్వప్నంలోనే తండ్రి గట్టిగా అడిగినా నోరు విప్పలేదట. అప్పటికే ఉద్యోగంనించి రిటైరయిన ఆ తండ్రి, ఇల్లూ, ఆస్తి దగ్గరవాళ్లకు వదిలేసి కొడుకును వెతికి పట్టుకోవాలని హిమాలయాలకు వచ్చేసి ఈ పర్వత ప్రాంతాలలోనే తిరుగుతున్నాడు.

కొడుకు ఇంటినించి తప్పిపోయిన నాలుగయిదు రోజుల్లోనే వాళ్ల ఇంటికి సమీపంలోనే ఓ పాడుపడిన బావిలో ఒక యువకుని మృతదేహం ఉబ్బిపోయిన స్థితిలో దొరికినప్పుడు, అది ధర్మారావే అన్నందుకు కృష్ణమూర్తికి వాడి స్నేహితుల మీద, బంధువుల మీద కోపమొచ్చింది. ఆ రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్లినప్పుడు ధర్మా తెల్లటి ఉలెన్ స్వెట్టర్ "డార్క్ బ్లూషర్ట్ వేసుకున్నాడని, అవి లేవు కనక ఆ మృతదేహం తన కుమారునిది కాదని ఎంత చెప్పినా వినక తన దగ్గరి బంధువులే దానికి దహన సంస్కారం చేశారు. ఆ రకంగా తన బంధువులే శత్రువులై తనమీద పగతీర్చుకున్నారంటాడు. ఆయన ఆ దుఃఖంతో కుమిలిపోయి, కొడుకును వెతికి

పట్టుకుని ఇంటికి తెచ్చి వాడుబతికే ఉన్నాడని రుజువు చేయాలని కూడా మొదట్లో ఆయనకి పట్టుదల కలిగింది.

మిస్ రేణూ ముఖర్జీ జయచంద్ర నోట ఈ కథ విన్నప్పుడు విలవిల్లాడి పోయింది. ఏడ్చింది. పితృహృదయపు మహాసౌందర్యంతో ప్రకాశించారు కృష్ణమూర్తిగారు. జయచంద్రలానే నాన్నగారూ అని పిలిచింది. అది మొదలు మిస్ ముఖర్జీకి కృష్ణమూర్తి గారి పట్ల ఆరాధనాభావం పెరిగింది. కృష్ణమూర్తిగారి లాంటి తండ్రులు కొందరు ఉన్నందువల్లనే మానవత్వం ఈ ప్రపంచంలో మనుగడ సాగిస్తున్నదని ఆమెకు అన్పించింది. కృష్ణమూర్తిని చూస్తే చాలు చల్లగాలికి పల్లవించే పూలమొక్కలా అయిపోతుంది. విహంగమై మనసు రెక్కలు చాచి గగనతలానికి ఎగిరిపోతుంది. వెచ్చని కాంతిలో స్నానం చేసినట్టు, ప్రాకృతికమైన పరమానందం ఆవేశించినట్టు, తన వాతావరణం పరిమళాలతో నిండిపోయినట్టు, కొత్త అందాలు కళ్లకు కనిపించినట్టు తాదాత్మ్యం పొందుతుంది.

ఎడిటర్ ఇన్ చార్జ్ సీటులో కూర్చున్న ఓ యువకుడు కృష్ణమూర్తిగారిని చూశాడు. దృష్టి అక్కడే కొంతసేపు నిలిచిపోయింది. తనకు ప్రాణప్రదమైన మనుషుల్ని, ఆప్తుల్ని చూస్తున్నట్టనిపించింది. తను చదివిన కావ్యాలలోని ఋషుల రూపాలు అతడిలో కన్పిస్తున్నాయి. రామకృష్ణ పరమహంస గురువు త్రైలింగస్వామి గుర్తుకొచ్చాడు. ఒక మహాద్భుతమైన అందం ఆ ముఖంలో. ఒకసారి ఆ చూపు తనను స్పర్శించితే ఎంత బావుండును అనుకున్నాడు. తన మీద అతడి చూపు పడాలని లేచి ఆ సాదుమూర్తి కూర్చున్నచోటుకు వచ్చి అక్కడ కూర్చున్నాడు. కృష్ణమూర్తిగారు చిరునవ్వుతో అతడి ప్రేమను స్వీకరించడంతో అతనికి దివ్యానుభూతి లాంటి గొప్ప సంతోషం కలిగింది.

ఎడిటర్ ఇన్ చార్జ్ తన సీటు దగ్గరకి వస్తుంటే ఏదో చెప్పటానికి వచ్చాడనుకుని మిస్ రేణూముఖర్జీ అతడిని చూసింది. అతడు తిరిగి వెళ్లి పోయాడు. నాన్నగారిని చూసి అతడు వచ్చిన పని మరచి వెళ్లిపోయాడేమో అనుకుంది.

ఆ బులిటిన్ తర్వాత ఆమెకు పావుగంటసేపు విరామం. ఆ సమయంలో సామాన్యంగా డ్యూటీలో ఉన్న మిగిలినసిబ్బందితో కేంటీన్‌కు వెళ్లి చాయి తాగివస్తుంది. బులిటిన్ పని మిస్ ముఖర్జీ ఆడుతూ పాడుతూ చేసుకోగలదు. అక్కడున్న చాలామందికి జర్నలిజం ఉద్యోగం కాగా మిస్ ముఖర్జీకి అది పుట్టుకతో అబ్బినవిద్య. ఆమె రాజకీయాలలో పుట్టి పెరిగింది. సుభాష్ చంద్రబోస్ అనుచరుడైన

ఆమె తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. ఎందరో ప్రముఖ రాజకీయవేత్తలూ మహాత్ములూ అడుగుపెట్టిన ఇల్లామెది. ఆమెది జర్నలిస్టుల కుటుంబం. ఆమె పెద్దన్నయ్య చిన్న వయసులోనే ఓ ప్రముఖ ఇంగ్లీషుదిన పత్రికకు వాషింగ్టన్ కరెస్పాండెంట్‌గా ఉంటున్నాడు. ఆమె బంధువులు చాలామంది రకరకాల పత్రికల్లో మంచి మంచి పదవుల్లో ఉన్నవాళ్లే.

మిస్ ముఖర్జీ డ్యూటీ అంటే దాస్‌కు సంతోషం. బెంగాలీలో ముచ్చట్లు చెప్పుకుంటూ పనిచేసుకోవచ్చు. జయచంద్రతో ఆట్లా కుదరదు. పనిలో మునిగిపోతాడు. చేతిలో పని ఉంటే వేరే ధ్యాస ఉండదు. కొందరు అసిస్టెంట్ ఎడిటర్‌లకు చేయటానికి ఏ పనీ దొరకదు. జయచంద్రకు మాత్రం చేతినిండా ఎప్పుడూ పని ఉంటుంది. డ్యూటీకి వస్తే తీరికే చిక్కదు. పైగా ఇతరుల పనుల్ని నెత్తిమీద వేసుకునే తత్వం.

టైపిస్ట్ దాస్ హెడ్‌లైన్స్ పూర్తిచేసి, ఆర్డర్ కూడా అయిన తర్వాత బులిటిన్‌ని చూసుకోమని మిస్ రేణూ ముఖర్జీ చేతిలో పెట్టాడు జయచంద్ర.

ఆమె బులిటిన్ చూసుకుని సరే అనే వరకు అక్కడే ఉండి ఎడిటర్ ఇన్ చార్జ్‌తో చెప్పి కృష్ణమూర్తిగారిని తీసుకుని జయచంద్ర కేంటీన్ వేపు నడిచాడు.

జయచంద్రలానే తన కుమారుడు ధర్మా ఇట్లాంటి ఉద్యోగంలోనే ఉండేవాడు. వాడికి లెక్చరర్ ఉద్యోగం ఇష్టం. జయచంద్ర లానే మనిషి నిండుకుండలా ఉండేవాడు. ఒకంతట దేనికీ భయపడే వాడుకాదు. వాడికి ఏం కావాలో తను చెయ్యాలే తప్ప వాడు నోరువిప్పి ఇది కావాలి అని ఎప్పుడూ అడిగేవాడుకాదు.

కేంటీన్ నిండా ఉదయం డ్యూటీ సిబ్బంది. ఓ టేబుల్ దగ్గర టీ తాగుతూ తెలుగున్యూస్‌రీడర్లు కన్పించి జయచంద్రను చూసి 'బావున్నారా' అని పలకరించారు.

రెండు కప్పులతో తిరిగి వచ్చాడు జయచంద్ర. "ఈ ఆకాశవాణిలో పని చేస్తున్న వందలాదిమంది సిబ్బందిలో ఎవరి రుచినిబట్టి వారికి టీ చేసిపెడతాడు మా పండిట్‌జీ. మనం వెడితే ఓ సారి మన ముఖం చూస్తాడు అంతే. మన ఇష్టం తెలిసిపోతుంది. ఈ ఆకాశవాణిలో అతడో కర్మవీరుడు" అని పండిట్‌జీని గురించి తన ప్రేమాభిమానాలు ప్రకటించుకున్నాడు.

అంతవరకు కృష్ణమూర్తిగారు నోరు విప్పనేలేదు. అన్నీ వింటున్నాడు. అమ్మాయి రేణు, అబ్బాయి జయచంద్ర ప్రేమాభిమానాలు ఈ లౌకిక ప్రపంచంలో ఆయనకు తియ్యటి అనుభూతులను రుచి చూపుతున్నాయి. వాళ్లిద్దరూ రెండు బొమ్మల్లా

కనిపిస్తారు. రెండుమూడేళ్ల పసిపిల్లల్లా అన్పిస్తారు.

"అబ్బాయ్, ధర్మాగాని ఇటువేపు నీ దగ్గరకు వచ్చాడా?" అడిగారు కృష్ణమూర్తిగారు ఆపని మీదే ఈ సారి ఇక్కడికి వచ్చానన్నట్టుగా.

ధర్మారావు రాలేదని చెబితే ఆయన తట్టుకోలేడు. ఆయన బాధపడకుండా ఎట్లా చెప్పాలో తోచక, ఆయన ముఖంలోకి చూడలేక తడబడుతున్నాడు జయచంద్ర. కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు.

"వచ్చినా కలవడులే నిన్ను. నువ్వు ఇక్కడున్నట్లు తెలిస్తే ఇదివరకే వచ్చి కలిసేవాడు కదా! వాడికి నువ్వు ఇక్కడున్నట్టు తెలిసిందేమో, తెలిస్తే వచ్చి నిన్ను తప్పని సరిగా కలుస్తాడులే అన్న ఆశతో వచ్చాను. మొన్న ఏమయిందో తెలుసా అబ్బాయ్, రిషీకేశ్‌లో ఆంధ్రాశ్రమం దగ్గర ఓ తెలుగు సాధువుగారు కన్పించి మీ అబ్బాయిలాంటి కుర్రాడినే చూశాను స్వామీ అన్నాడు. ఆ సాధువుగారు చెబుతున్నది నిజమోకాదో తేల్చుకుందామని ఎట్లాంటి బట్టలు వేసుకున్నాడని అడిగాను. లాల్చీ, పైజామా అన్నాడు. ఏ రంగువని అడిగాను. తెల్లరంగు అన్నాడు. ధర్మా ఎప్పుడూ తెల్లటి లాల్చీ పైజామానేకదా వేసుకునేది. పోతే, పోలికలు చెప్పు అన్నాను. అన్నీ మీ పోలికలే స్వామీ. విశాలమైన నుదురు. పెద్దకళ్లు. కొనదేలిన ముక్కు. అవును వాడివన్నీ నా పోలికలే. ఎక్కడ చూశావయ్యా స్వామీ అని అడిగాను. బస్టాండ్ దగ్గర చూశాడట. ఢిల్లీ వేపు వచ్చే బస్సు ఎక్కాడట. అంటే వాడు నీ దగ్గరికే కదా రావాలి" అని మరో గుక్క టీ తాగారు కృష్ణమూర్తిగారు.

విశ్వాంతరాళంలో దూరాన్ని కొలవడానికి కాంతి సంవత్సరాల కొలబద్ద ఉన్నట్టు మనిషి లోపల ఉన్న దుఃఖసముద్రాలను చూపటానికి కన్నీటి బిందువులే మిగిలాయి. జయచంద్ర కళ్లలోంచి అవి జలజలా రాలాయి. చీకటిరాత్రి నదిలో పడిపోయిన బస్సు తల్లినీ అన్నయ్యనీ అతడి భవిష్యత్తునూ సముద్రంలో ముంచేసిన దుఃఖం ఉప్పొంగింది జయచంద్రలో.

రెండు సముద్రాలు రెండు ముఖాలతో రెండు ప్రతిమలయ్యాయి అక్కడ.

కృష్ణమూర్తి గారు మరో గుక్క టీ తాగి "చూశావా అబ్బాయ్. వాడు నా చుట్టే తిరుగుతున్నాడు. ఏదో మాయ. మాయ మూలంగా ఒకరిని ఒకరం పోల్చుకోలేక పోతున్నాం. కలుసుకోలేక పోతున్నాం"

అని శూన్యంలోకి చూశారాయన.

అంతర్ధానమైన తన కుమారుడు నడచిన అదృశ్యమార్గాలలో అందని అందాన్ని

వెతుకుతున్నాయి ఆ చూపులు. హిమాలయపర్వతసానువుల్లో, నదీ తీరాల్లోని పుణ్య క్షేత్రాలపరిసరాల్లో, అరణ్యాల్లో, లోయల్లో తండ్రి కోసం వెతుకుతున్న పుత్రుని కలుసుకోవటం కోసం కృష్ణమూర్తిగారు తయారయ్యారు.

"వస్తాను అబ్బాయ్" కిందటిసారిలా రిషీకేష్ రావాలిసుమా. రేణూను కూడా రమ్మన్నానని చెప్పు. తప్పకుండా తీసుకురా" అని చెప్పేసి ఆ చలికాలపు ఉదయాన బయటపడ్డారాయన.

"కాదు నాన్నగారూ, రేణూతో ఓసారి చెప్పివెళ్లండి." అని జయచంద్ర ఎంత బతిమాలినా ఆయన వినిపించుకోలేదు. వెనక్కి తిరిగి కూడా చూడలేదు.

రిషీకేశ్‌లో తనకోసం వచ్చి వెతుకుతున్న ధర్మాకి తను కనిపించకపోతే వెళ్లిపోతాడేమోనన్న ఆందోళనతో వడివడిగా నడిచిపోతున్న కృష్ణమూర్తిగారితో బైటి గేటు వరకు వెళ్లాడు జయచంద్ర. విద్యుద్దీపాల వెలుతురుకిందినించి, చెట్లనీడల్లోంచి, ఉషోదయపు రంగుల వర్షంలో తడుస్తూ, ప్రవాహంలో కొట్టుకు పోయిన పువ్వులా, చూపు అందని మలుపుల్లో ఆయన మాయమయ్యారు.

జయచంద్ర న్యూస్‌రూమ్‌కి వెళ్లేసరికి మిస్ ముఖర్జీ సీట్లో లేదు. గడియారం చూసి స్టూడియోలోకి వెళ్లాడు. ఆమె స్టూడియోలో న్యూస్ రీడర్‌కు కరెక్షన్ చెబుతున్నది. పి. ఎమ్. స్టోరీని లీడ్‌హెడ్‌లైన్ చేయమని డైరెక్టర్ చెప్పాడట. న్యూస్ రీడర్ స్టుడియోలోకి వెళ్లిన తర్వాత ఎడిటర్ ఇన్ చార్జ్ వచ్చి చెబితే తాను వచ్చిందట.

న్యూస్‌రూమ్‌కి వచ్చిన తర్వాత కృష్ణమూర్తిగారు కన్పించక పోయేసరికి 'నాన్నగారు ఎక్కడ?' అని అడిగింది మిస్ రేణూ ముఖర్జీ.

"వెళ్లిపోయారు, ఎంత బతిమాలినా ఆగలేదు" అని జయచంద్ర చెపుతుంటే మిస్ ముఖర్జీకి కోపమొచ్చింది. తర్వాత కన్నీళ్లు ముంచుకొచ్చాయి. తను ఉన్నట్టయితే నాన్నగారిని కదలనిచ్చేది కాదట. అడ్డంపడేదట. ఏడ్చయినా అడుగు ముందుకు వేయనిచ్చేదికాదట.

* * *

(జంపన శ్రీహరిరాజుకు స్నేహాభినందనతో)

*86 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక*